# జీవిత దృశ్యాలు



## పై మెరుగు లోకం, ఏమెరుగు శోకం!

- అవసరాల రామకృష్ణా రావు

రామ్మూర్తి మనసు మహా చికాగ్గా ఉంది. ఇటు అక్క, అటు ఆప్తమిత్రుడూ. ఇద్దరి సలహా ఒకే మాదిరిగా ఉండడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. నిజంగా అంతకంటే తన మేలు కోరేవారు ఎవ రుంటారు! డబ్బు ఉండొచ్చు, లేకపోవచ్చు. ఆపాటి ఆత్మాభిమానానికైనా తను నోచుకోడా? తన తరపున వకాల్తా పుచ్చుకుని, త నెలా అవమానించబడ్డాడో అర్థం చేసుకుని, తగిన ప్రతిక్రియ సూచించారు వా ళ్ళిద్దరూ. ఏ నిర్ణయం తీసుకోవాలో తేల్చి చెప్పేశారు కూడా. అది వెంటనే ఆచరణలో పెడితే గాని తన మనసు తేలికవడ దనిపించింది రామ్మూర్తికి. ఆ ఉద్రేకంలోనే తల్లి పేరిట నాలుగు ముక్కల ఉత్తరం రాసేశాడు కూడా. అ దిలా పూర్తి చేశాడో, లేదో శాంతి మాస్టారు వచ్చి వీధి గదిలో కూచున్నారని పె ద్దమ్మాయి చెప్పి వెళ్ళింది. ఆతను మరీనూ, చిన్నప్పు డతని దగ్గర చదువుకోడం కాదు గాని, ఇక ఆ రాకపోకలకీ, ఆ నీతి సూత్రాలకీ అంతూ, దరీ అంటూ ఉండవు. వినుక్కుంటూనే వెళ్ళి నమస్కారం చేశాడు.

"ఏవిటోయ్! అమ్మడి కేదైనా సంబంధం జతపడిందా?" అంటూ పలకరించా డాయన, కాఫీ గ్లాసు అందుకుంటూ. ఆయన కాఫీ పూర్తి చేసేదాకా ఆగి రామ్మూర్తి మొదలెట్టాడు:

"మాస్టారూ! చిన్నప్పట్నుంచీ నన్ను ఎరిగున్నవారు. అదీగాక మీలా అభిమానం చూపించే పెద్ద దిక్కు కూడా మాకు మ రెవరూ లేరు. నే నేమన్నా మీరు మరోలా అనుకోరనే ధైర్యంతో ఇవాళ నా మనసులో ఉన్నదంతా మీ ముందు వెళ్ళగ్రక్కదలుచుకున్నాను. మా పెద్దమ్మాయికి పెళ్ళి, రెండో దానికి కాలేజీలో సీటూ, అబ్బాయికి ఉద్యోగం, మా ఆవిడకి 'హిస్టీరియాక్షమీ' ఆవరేషనూ... ఇలాంటి వెయ్యినొక్క ఇబ్బందుల నుంచి విముక్తి కలగడానికి ఇన్నాళ్ళకి నా కొక్క ఉపాయం తోచిందండీ... ఏమి టలా ఆశ్చర్యంగా చూస్తున్నారూ?"

"అబ్బే, ఎన్నేళ్ళు నే నేం చెప్పినా బెల్లంకొట్టిన

రాయిలా ఉలుకూ పలుకూ లేకుండా ఈ కొట్టడమేనా లేకుండా కూచునే వాడివి. ఈ రోజున నీకు నువ్వుగా, ఎత్తిన తల దించకుండా దంచేస్తూంటే ఆశ్చర్యమా, మరీ ఆశ్చర్యమా? ఈ నీ ఇంటి పరిస్థితులు ఇవాళా, నిన్నా వచ్చినవి కావు. కేవలం నీ ఒక్కడి ఇంట్లోనే ఇలాంటివి లేవు కూడా. అలాంటిది ఉన్నట్టుండి నీ కింతటి జ్ఞానోదయం అవడానికి జరిగిన గీతోపదేశం ఏమిటా అని... చెల్లాయమ్మగారు గాని నీ దగ్గరికి ఏకంగా వచ్చేస్తానని రాశారా, ఏం?'' అని అడిగిన మాస్టారి వైపు విస్మయంగా చూశాడు రామ్మూర్తి.

చెల్లాయమ్మగా రంటే మ రెవరో కాదు, తన తల్లే. నాన్న పోయిం దగ్గర్నుంచీ ఆమె ఆలనా పాలనా తమ్ముడు ప్రభాకరం చూస్తున్నాడు. నాన్నగారికి కేన్సరు వచ్చిందనీ, ఇక బతకడనీ డాక్టరు చెప్పకుండానే రోగి గ్రహించడం జరిగింది. శాంతి మాస్టారూ, నాన్న కలసి చదువుకున్నారు కూడా. చనిపోయేముందు నాన్న మాస్టారితో చెప్పాడు - ''ఒరే శాంతీ! నేను పోతున్నాను. మా పెద్దాడు బొత్తిగా అమాయకుడు. చిన్న ఉద్యోగం. ఇది చాలక నిత్య రోగిష్టి అయిన పెళ్ళాం. వాడి ప్రాణానికి అదీ, ఆ పిల్లలూ చాలు. ఇక తల్లి నేం చూస్తాడు? మా అవిడ చిన్నాడి దగ్గర ఉంటుంది. ఫామిలీ పెన్షను వెయ్యి రూపాయ లందుతుంది గనక తల్లి పోషణకోసం అందులో అయి దొందలు చిన్నోడు ఉంచుకుంటాడు. వాడి మామగారు భాగ్యవంతుడూ, వాడి పెళ్ళాం గడుసుదీ గనుక ఆమాత్రంతో మెయిన్‌టెయిన్ చెయ్యగలరు. మిగిలిన అయి దొందలూ ఏ నెల కా నెల రామ్మూర్తికి పంపెయ్యాలని నా కోరిక. వింటున్నారుగా? ఇక ఉన్న ఒక ఆడపిల్లా నుగుణకి ఏం పెట్టారని అది దుఃఖపడకుండా తల్లి ఒంటెడు నగలూ, ఇంట్లో ఉన్న ఇత్తడీ, వెండీ అన్నీ దానికి ఇప్పుడే ఇచ్చేస్తున్నాను.''

ఆయన కోరినట్లే అక్షరాలా పిల్లలు జరిపించారు కూడా. ఆయన పోయిన ఈ మూడేళ్ళూ చెల్లాయమ్మగారు ప్రభాకరం దగ్గరే ఉండి నెల నెలా పెద్ద కొడుక్కి డబ్బు పంపిస్తోంది. ప్రభాకరానికి ప్రమోషన్ వచ్చింది ఈమధ్య. ఉన్న ఒక్క కొడుక్కి ఇంజనీరింగులో సీటు వచ్చింది కూడా. నుగుణకి పిల్లలు పుట్టలేదు. ఆమధ్యనే మరిది కొడుకుని దత్తత తీసుకుంది. ఆ దత్తతతో పాటు హైదరాబాదులో మంచి సెంటర్లో ఉన్న ఓ ఇల్లు కూడా దఖలు పడింది. నానాటికీ తీసికట్టుగా తీనుకుంటున్నది రామ్మూర్తి కుటుంబం మాత్రమే.

తన మనో వ్యథకి మూలకారణం తల్లి చెల్లాయమ్మగారే అని శాంతి మాస్టారు అంత తొందరగా మరోసారి గుర్తించడం రామ్మూర్తికి విస్మయం కలిగించి, తను చెబ్దా మనుకున్న దేదో గొంతుక దగ్గరే ఆగిపోయింది. అయినా మాస్టారు అలా ఆగిపోతే ఊరుకునే రకం కాదు. సాగదీసి అసలు విషయం బయటకి లాగగలిగారు.

ఆ ముందు రోజు నుగుణ ఆ ఊరునుంచి పాస్ అవుతూ రామ్మూర్తికి స్టేషనుకి రమ్మని రాసిందిట. తమ్ముణ్ణి కలుసుకున్నప్పుడు నుగుణ చెప్పిన మాటలు ఇవీ: ''ఏంరా రామూ రోజు రోజుకీ మరీ అలా తయారవుతున్నావ్, ఏం, మరద లింకా మంచంమీంచి దిగడం లేదా? అయినా ఇరవై నాలుగ్గంటలూ అలా మూలుగుతూ పడుకుని మొగుడి చేత, పిల్లల చేత చేయించుకునేది అసలు ఆడదేనా అని! కొంచెం అటూ ఇటూ అయితే అవుతుంది, డిస్పార్టీ బాధ ఏ ఆడదానికి తప్పిందని! నెల అయేసరికి అయి దొందలు చేతిలో పడుతూంటే ఇక మంచం దిగాల్సిన అవసరం ఏముందిలే! అయినా నీకుండాలిరా సిగ్గు! పెళ్ళాన్ని కంట్రోల్ చెయ్యలేని వాజమ్మవి, మనసునైనా కంట్రోల్ చేసుకుని అమ్మ పంపే డబ్బు వద్దని చెప్పొచ్చుగా! నిజంగా అది స్త్రీ ధనం. అడిగే హక్కు నాదీ. అయినా ఎప్పుడేనా అడిగేనట్రా? అప్పనంగా అందుకుంటే అరుగుతుందిట్రా?''

నుగుణ మాటలు ములుకుల్లా తగిలి, తట్టుకోలేక ప్రాణస్నేహితుడు ప్రకాశం దగ్గర కెళ్ళి ఆ వేదనంత వెళ్ళగ్రక్కాడు రామ్మూర్తి.

''ఒరే రామం! ఇన్నాళ్ళకైనా మీ అక్క నీకు కనువిప్పు కలగజేసినందుకు సంతోషం. వృద్ధాప్యంలో సేవ లందించలేని తల్లినుంచి నెల నెలా డబ్బు అందుకోడ మంత దరిద్రం ప్రపంచంలో మరోటి లేదు. ఆ డబ్బు అలా వస్తున్నంత కాలం తల్లిని కాక, ఆమె పంపే డబ్బునే ఎప్పుడూ తలుచుకుంటూ ఉంటావు నువ్వు. ఎంతటి రక్తబంధాలూ ఆర్థిక కబంధ హస్తాల్లో కలుషితం అయిపోతాయి. ఇది నీకు శుభం కాదు. అందుకే నీ కుటుంబం ఎత్తిరిల్లడం లేదు. స్టాపిట్ ఇమీడియట్లీ.''

వచ్చే నెల నుంచి తన కిక సొమ్ము పంపించవద్దని రామ్మూర్తి తల్లి పేర ఉత్తరం రాసేశాడు. ఇక పోస్టు చెయ్యడమే తరువాయి. శాంతి మాస్టారుతో జరిగిందంతా చెప్పుకున్నాడు.

అన్నీ విని ఆలోచించి ఆయన ఇచ్చిన తీర్పు ఇదీ:

''నుగుణ కానీ, మీ ఫ్రెండు ప్రకాశం గానీ, మ రెవరైనా గాని ఈ లోకంలో మనుషులు. లోకాని కేం కోర్టై కూస్తుంది, కాకై పొడుస్తుంది. నాలుగు వేళ్ళూ నోట్లోకి వెళ్ళిన ప్రతి ఒకరూ మానవ సహజమైన అసూయతో అనేక హితబోధలు చెయ్యొచ్చు. పిల్లా పీచూ లేదు కదా, చచ్చినంత ఆస్తి వచ్చిపడింది కదా, మీ నుగు ణక్క మీ అమ్మని తెచ్చి ఎందుకు దగ్గర పెట్టుకోదు? మీ ప్రకాశం సంగతి నాకు తెలియంది కాదు. తనూ, పెళ్ళామూ ఉద్యోగాలు చేస్తూ ముసలి తండ్రి చేత వీధి కొళాయి నుంచి బిందెలకి బిందెలు మంచినీళ్ళు తెప్పించేవాడూ నీకు మాతృసేవ గురించి సలహాలు ఇవ్వడమే! ఇంతకీ మీ అమ్మ చెల్లాయమ్మగారిని ఈమధ్యనే చూసి వచ్చా. ఇప్పటికీ టింగురంగా మని ఇంటెడు చాకిరీ ఎడం చేత్తో చేసిపారేసే ఆరోగ్యంతో ఉంది. ఆవిడకి ఎవరైనా నిజంగా సేవ లందిస్తే వెంటనే జబ్బు పడిపోతుంది! కాబట్టి ఆ ఉత్తరం ఇలా ఇయ్యి.'' అని జేబులోంచి ఊడలాక్కుని ఇంతింత ముక్కలు చేసేశాడు.

''ను వ్వింతటి తెలివైన వాడివని తెలిసే మీ నాన్న ఇలాంటి ఏర్పాటు చేశాడు. ఆయన లేకపోయినా నే బతికున్నాను. ఆ ఏర్పాటుని నువ్వు కాదంటే నే ఊరుకుంటానా? మూడో పురుష్టే పట్టుకున్న డిస్పార్టీ జబ్బు తట్టుకోలేక నీ పెళ్ళాం ఎంత గిల గిల కొట్టుకుంటూందో నీకూ తెలును, అప్పుడప్పుడు ఆవిణ్ణి ఆసుపత్రికి తీసుకెళ్ళే నాకూ తెలును. పైవాళ్ళ కేం పట్టింది నాలుగు రాళ్ళు విసరడం తప్ప! ఎల్లకాలం ఒకరి దగ్గర చెయ్యి జాపే స్థితిలో ఉండమని ఎవరూ చెప్పరు. అన్ని విధాలా ఆర్జించవలసిందే. కాని, ఈ రోజు ఎలా వెళ్ళాలో ఆలోచించుకోవాలి కద! 'ఫాల్స్ ప్రిస్టేజ్'ని పారద్రోలి కాస్త 'ప్రాక్టికల్'గా ఆలోచించు మరి!''

శాంతి మాస్టారి వైపు గౌరవంగా చూశాడు రామ్మూర్తి. ★

**రాకూడదు**

*స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకోవడానికి వచ్చిన నరేష్ మెట్లమీద జారిపడ్డాడు.*

*''బాబోయ్! ఈ మెట్లే ఇంత ప్రమాదకరంగా ఉన్నాయి. బాగా ఈత వచ్చే వరకూ ఇక్కడకు రాకూడదు'' అన్నాడు వెంట వచ్చిన భార్యతో.*

*కె. వెంకటరామ అక్కయ్య [పామర్రు]*

**జీవిత దృశ్యాలు -**
**వచ్చే వారం 'సాయం'**

